# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 13 ఏప్రిల్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## దేశవ్యాప్తంగా అలర్ట్

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

దేశవ్యాప్తంగా ప్రజలంతా అలర్ట్‌గా ఉండాలని, ప్రత్యేకించి మతపరమైన సంక్లిష్టతలు, సున్నిత ప్రాంతాల్లో అదనపు జాగ్రత్తలు అవసరం అని ఇంటలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. ముంబై దాడుల ప్రధాన నిందితుడు రాణాను ఇప్పుడు ఎన్ఐఎ తమ కస్టడీలో ఇంటరాగేట్ చేస్తోంది. ఈ క్రమంలో ఇందుకు ప్రతీకారంగా, తమ ఉనికిని చాటుకునేందుకు ఉగ్రవాద సంస్థలు కొన్ని పనిగట్టుకుని ఫక్కా ప్రణాళికలతో రంగంలోకి దిగుతున్నట్లు నిఘా సంస్థలు పసికట్టాయి. దీనితో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చేసేందుకు అంతా జాగ్రత్తలు తీసుకోవల్సి ఉంటుందని సంబంధిత భద్రతా సంస్థలకు ఆదేశాలు వెలువరించారు. అమెరికా నుంచి రాణాను ఇక్కడికి తరలించారు. ఇప్పుడు కోర్టు ఆదేశాలతో రాణా పాత్రను నిర్ధారించుకునే విధంగా చర్యలు చేపట్టారు.అయితే పొరుగుదేశం పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థలు తమ ఆప్తుడిని రక్షించుకునేందుకు లేదా, ప్రతీకారంగా హింసాత్మక, వివిధ మతాల మధ్య చిచ్చు రగిల్చేందుకు వ్యూహరచన చేసుకుంటున్నట్లు వెల్లడైంది. ఈ ఉగ్రవాది విచారణ క్రమంలో కీలక విషయాలు వెలుగులోకి రానున్నాయి. ప్రత్యేకించి పాకిస్థాన్‌లోని టెర్రర్ నెట్‌వర్క్ కార్యకలాపాల నిజరూపం బహిరంగం కానుంది. ఇది అంతర్జాతీయంగా తమకు ఇబ్బందికర పరిణామం అవుతుందని పాకిస్థాన్‌కు, అక్కడి గూఢచారి సంస్థ ఐఎస్ఐకు తెలుసు. జలమార్గాల మీదుగా ముష్కరులు ఇక్కడికి

మిగితా 2వ పేజీలో

## వనజీవి రామయ్య హఠాన్మరణం



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

'వనజీవి'గా ప్రసిద్ధి చెందిన సామాజికవేత్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత దరిపల్లి రామయ్య(85) గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. గత కొంతకాలంగా రామయ్య అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. శనివారం తెల్లవారుజామున ఇంట్లో స్పృహ లేకుండా ఉంటే దగ్గరలోని ఆర్ఎంపీకి చూయించి ప్రభుత్వ ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తీసుకువచ్చారు ఆస్పత్రిలో చికిత్స అందిస్తుండగానే రామయ్య చనిపోయారు. కోటి మొక్కలకు పైగా వనజీవి రామయ్య, జానకమ్మ దంపతులు నాటారు. కోటికి పైగా మొక్కలను నాటి వనజీవి రామయ్య చరిత్ర సృష్టించారు. . మొక్కలను పెంచాలని చిన్నతనం నుంచే ప్రచారం చేశారు. వనజీవి రామయ్యకు నలుగురు పిల్లలు.. వారిలో ముగ్గురు అబ్బాయిలు, ఒక అమ్మాయి ఉన్నారు. వనజీవి రామయ్య భార్య పేరు జానకమ్మ.


రామయ్య చేసిన సేవలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి 2018లో పద్మశ్రీతో సత్కరించింది. రాష్టపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డును వనజీవి రామయ్య ఢిల్లీలో అందుకున్నారు. వనజీవి రామయ్య ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లికి చెందిన వారు. ప్రభుత్వ, ప్రైవేటు అవార్డులు, 3వేల షీల్డ్‌లను వనజీవి రామయ్య పొందారు. రామయ్య మృతితో ప్రకృతి ప్రేమికులు శోక సంద్రంలో మునిగిపోయారు. రామయ్యను కడసారి చూడటానికి ప్రకృతి ప్రేమికులు, ప్రజలు రెడ్డిపల్లిలోని ఆయన ఇంటికి తరలి వచ్చారు.

1937, జూలై 1న దరిపెల్లి లాలయ్య, పుల్లమ్మ దంపతులకు జన్మించారు. ఆయన ఇంటిపేరు దరిపల్లి రామయ్య అయినప్పటికీ వనజీవిగా మార్చుకున్నారు. ఆయనను చెట్ల రామయ్య అనికూడా పిలుస్తారు. 50 ఏండ్లుగా అలుపెరగకుండా విత్తనాలు చల్లుతూ మొక్కలు పెంచేందుకు ప్రయత్నించారు. వేసవిలో విత్తనాలు సేకరించి తొలకరి రాగానే వాటిని ఆయా ప్రాంతాల్లో చల్లుతుండేవారు. ఇలా 120 రకాల మొక్కల చరిత్రను అలవోకగా చెప్పగలరు వనజీవి. మూడు కోట్ల మొక్కలు నాటాలన్నదే తన లక్ష్యమని వనజీవి రామయ్య చెప్పుండేవారు. తెలంగాణ ప్రభుత్వం ఆరో తరగతి సాంఘీకశాస్త్రంలో వనజీవి గురించి పాఠ్యాంశంగా చేర్చింది. అదేవిధంగా మహారాష్ట్ర ప్రభుత్వం అక్కడి తెలుగు విద్యార్థుల కోసం 9వ తరగతి తెలుగు

మిగితా 2వ పేజీలో

## అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి

- నిరుపేదలకు న్యాయం చేయాలి
- ఇందిరమ్మ కమిటీలు జాగ్రత్తగా పనిచేయాలి
- దందాలకు పాల్పడే వారిపై తక్షణమే కేసులు నమోదు చేయాలి.
- గృహ నిర్మాణంలో లబ్ధిదారుల అవసరాలకు అనుగుణంగా 50 శాతం అదనపు స్థలాన్ని నిర్మించుకునే అవకాశం కల్పించాలి.
- ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద మొదటి దశలో అత్యంత నిరుపేదలకు, అర్హులకు మాత్రమే గృహాలను కేటాయించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ పథకం పారదర్శకంగా, నిరుపేదలకు న్యాయం చేసేలా అమలు కావాలని ఉద్ఘాటించారు.మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ఇందిరమ్మ ఇండ్లపై ఉన్నత స్థాయి సమావేశంలో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి అధికారులకు కీలక సూచనలు చేశారు.

"ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీలు అత్యంత జాగ్రత్తగా పనిచేయాలి. కమిటీలు తయారు చేసిన అర్హుల జాబితాను తహశీల్దార్, ఎంపీడీవో, ఇంజినీర్‌లతో కూడిన మండల స్థాయి బృందం క్షేత్రస్థాయిలో స్వయంగా తనిఖీ చేసి, ధృవీకరించాలి. ఒకవేళ అనర్హులకు ఇండ్లు కేటాయించబడినట్లు తేలితే, వెంటనే ఇందిరమ్మ కమిటీకి తెలియజేసి, ఆ స్థానంలో అర్హులైన వారికి గృహం మంజూరు చేయాలి. పథకంలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చూడాలి. దందాలకు పాల్పడే వారిపై తక్షణమే కేసులు నమోదు చేయాలి. అనర్హులు ఇండ్లు నిర్మించుకున్నట్లు తేలితే చట్టపరమైన చర్యలతో పాటు, వారు పొందిన నిధులను వసూలు చేయాలి.

లబ్ధిదారుల సౌకర్యం కోసం అదనపు సదుపాయాలను కల్పించాలి. గృహ నిర్మాణంలో లబ్ధిదారులు తమ అవసరాలకు అనుగుణంగా 50 శాతం అదనపు స్థలాన్ని నిర్మించుకునే అవకాశం కల్పించాలి. ఇందిరమ్మ ఇండ్లకు సిమెంట్, స్టీల్ వంటి నిర్మాణ సామగ్రిని సరసమైన ధరలకు అందుబాటులో ఉంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరుపేదల జీవితాల్లో వెలుగు నింపే లక్ష్యంతో రూపొందింది కాబట్టి ఈ పథకం అమలులో పారదర్శకత, నిజాయితీ ప్రధానంగా ఉండాలి. అర్హులైన వారికి మాత్రమే ఈ గృహాలు దక్కేలా చూడాలి" అని ముఖ్యమంత్రి గారు పేర్కొన్నారు.

## భూభారతి పోర్టల్‌పై ఉన్నత స్థాయి సమీక్ష

### రేపు భూ భారతి పోర్టల్‌ను ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో భూ సమస్యలను పరిష్కరించడంతో పాటు, లావాదేవీల సమాచారాన్ని రైతులకు, ప్రజలకు సులభంగా, వేగంగా అందించేందుకు రూపొందిన భూ భారతి పోర్టల్‌ను ఏప్రిల్ 14, సోమవారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గారు ప్రారంభించనున్నారు. భూ సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, పారదర్శకతను నిర్ధారించే లక్ష్యంతో రూపొందించిన భూభారతి పోర్టల్ పై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడరితో కలిసి ఉన్నత స్థాయి సమావేశంలో సమీక్షించిన ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు.

"భూ భారతి పైలట్ ప్రాజెక్ట్‌గా తెలంగాణలో మూడు మండలాలను ఎంపిక చేసి, వాటిలో జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించాలి. ఈ సదస్సుల ద్వారా భూ భారతి పోర్టల్ గురించి రైతులు, ప్రజలకు సమగ్రంగా వివరించి, వారి సందేహాలను నివృత్తి చేయాలి. పైలట్ ప్రాజెక్ట్ విజయవంతం తర్వాత, రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మండలంలో ఇలాంటి అవగాహన సదస్సులు నిర్వహించాలి. భూ భారతి పోర్టల్ సరళమైన, సులభంగా అర్థమయ్యే భాషలోనే ఉండాలి. ప్రజల నుంచి వచ్చే సలహాలు, సూచనల ఆధారంగా దానిని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి.

మిగితా 2వ పేజీలో

## ఐసీఐసీఐ కీలక ప్రకటన

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**





తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీఎస్ఐఐసీ)కి ఎటువంటి తనఖా రుణాన్ని అందించలేదని ఐసీఐసీఐ బ్యాంకు ఒక ప్రకటనను విడుదల చేసింది. బాండ్ల జారీకి సంబంధించి తమ వద్ద ఎలాంటి స్థలాన్ని తనఖా పెట్టలేదని కూడా తెలిపింది. తాము బాండ్ల జారీ ద్వారా వచ్చే నిధుల స్వీకరణ, వడ్డీ చెల్లింపునకు సంబంధించి టీఎస్ఐఐసీకి అకౌంటు బ్యాంకుగా మాత్రమే వ్యవహరించామని పేర్కొంది.

### 400 ఎకరాల తనఖా విషయంలో

## చీకటి కోణం ఏమిటి?

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



కంచ గచ్చిబౌలి భూములను తాము తనఖా పెట్టుకోలేదని ఐసీఐసీఐ బ్యాంకు విడుదల చేసిన ప్రకటనపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందించారు. టీజీఐఐసీ ద్వారా 400 ఎకరాలు తనఖా పెట్టి రుణం పొందామని అసెంబ్లీలో నేను అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పింది. మరి నేడు ఐసీఐసీఐ బ్యాంక్ మేము తనఖా పెట్టుకోలేదు అని చెబుతోంది. అంటే ఆ 400 ఎకరాల కంచ గచ్చిబౌలి భూమిని ప్రభుత్వం ఎవరి వద్ద తనఖా పెట్టినట్లు? రేవంత్ రెడ్డి తన బ్రోకర్ కంపెనీలకు తనఖా పెట్టారా ? 400 ఎకరాల తనఖా విషయంలో దాగి ఉన్న చీకటి కోణం ఏమిటి? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం దీనిమీద శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## 400 ఎకరాల భూమిని కాపాడాం

- ఏఐ ద్వారా ఏనుగులు సంచరిస్తున్నట్లు చూపించారు
- ఆ భూమిని రూ.30వేల కోట్లకే కాంగ్రెస్ బేరం పెట్టిందంటూ కేటీఆర్ దుష్ప్రచారం
- ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ప్రైవేటుపరం కాబోతున్న 400 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం కాపాడిందని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఈ భూములు ప్రభుత్వానివేనని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంగా చెప్పినప్పటికీ కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఏఐ వీడియోలు సృష్టించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు.

రాష్ట్ర సంక్షేమానికి బీఆర్ఎస్ పెద్ద విరోధిగా మారిందనివిమర్శించారు. అబద్ధపు ప్రచారంతో ప్రభుత్వాన్ని బదనాం చేసేందుకు మాజీ మంత్రి కేటీఆర్ కంకణం కట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడో తొమ్మిదేండ్ల క్రితం రాజస్థాన్‌లో చనిపోయిన జింకపిల్లను చూపించి హెచ్‌సీయూలో చనిపోయినట్లు బీఆర్ఎస్ క్రియేట్ చేసిందని చెప్పారు. అక్కడ ఏనుగులు సంచరిస్తున్నట్లు ఏఐ ద్వారా చూపించి ప్రజల్లో అనుమానాలు రేకెత్తించారని వాపోయారు. అన్నీ విషయాల్లో బాధ్యతాయుతంగా పని చేసేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ప్రకృతి కాలుష్యాన్ని తరిమి కొట్టేందుకు మూసీ ప్రక్షాళన చేపట్టబోతున్నట్లు తెలిపారు. మూసీ పరివాహక ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని తెలిపారు. ఇలాంటి వాస్తవాలన్నింటినీ మరుగునపరిచి బీఆర్ఎస్ సోషల్ మీడియాను ఉపయోగించుకుని తమ ప్రభుత్వంపై కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. రూ. 5200 కోట్ల భూమిని రూ.30వేల కోట్లకు చూపించారంటూ కేటీఆర్ అనడమేంటని ప్రశ్నించారు. సెక్యూరిటీ బ్యూరో ఆఫ్ ఇండియా అనే రియల్ ఎస్టేట్ సంస్థ ద్వారా చేసిన సర్వే ప్రకారం రూ.23వేల కోట్ల విలువ వచ్చిందని గుర్తు చేశారు. దాన్ని సెబీ, ఆర్‌బీఐ కూడా నిర్ధారణ చేశాయన్నారు. ఐసీఐసీఐ కూడా రుణం ఇవ్వలేదని తెలిపారు. టీజీఐఐసీ మార్కెట్ ఫోర్ సెస్ ద్వారా 37 అంతర్జాతీయ సంస్థల నుంచి మ్యూచువల్ పెట్టుబడులు బాండ్ల ద్వారా ప్రభుత్వం సేకరించిందని చెప్పారు. తక్కువ వడ్డీతో ప్రభుత్వ సంక్షేమం కోసం నిధులు సేకరించిందని వివరించారు. బాండ్ల రూపంలో (5.12.2024) రూ.9,995 కోట్ల

మిగితా 2వ పేజీలో




## బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు అనుమతి

**బలగం టీవి, హనుమకొండ**

భారత రాష్ట్ర సమితి రజతోత్సవ మహాసభకు అనుమతి ఇస్తూ హనుమకొండ జిల్లా కాజీపేట ఏసీపీ శనివారం ఉత్తర్వులు జారీచేశా రు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ నిర్వహణ కోసం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ మార్చి 28న పోలీసులకు దరఖాస్తు చేశారు. అలాగే ఈ నెల 9న హైకోర్టును ఆశ్రయించారు. వాదనల అనంతరం ఈ నెల 17లోపు నిర్ణయం తీసుకోవాలని కోర్టు పోలీసు శాఖ ను ఆదేశించింది. ఈ మేరకు బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు అనుమతిస్తూ కాజీపేట ఏసీసీ తిరుమల్ రాత్రివేళ సర్క్యులర్‌ను జారీ చేశారు. దా స్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు సతీశ్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, దివ్యాంగుల సంస్థ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి అనుమతిపత్రాన్ని తీసుకున్నారు.

## దమ్ముంటే ఆ ఎంపీ ఎవరో చెప్పు

- ఎంపీ డీకే అరుణ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



ఇటీవల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణల పైన బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విజయవాడలో మీడియాతో మాట్లాడిన ఎంపీ డీకే అరుణ .. కటీఆర్ ఆరోపణలు చేయడం కాదు, దమ్ముంటే ఆ బీజేపీ ఎంపీ ఎవరో చెప్పాలని వారి పేరు వెల్లడించాలన్నారు. గాలి మాటలు మాట్లాడొద్దు కేటీఆర్ ఆ ఎంపీ ఎవరో చెప్పకుండా ఓ ఎంపీ అంటూ గాలి మాటలు మాట్లాడితే సరిపోదని ఆమె తీవ్ర స్థాయిలో విమర్శించారు. రేవంత్ రెడ్డి, కేటీఆర్ ఇద్దరు ఒకటేనని అందుకే తమిళనాడు సీఎం స్టాలిన్ చెన్నైలో నిర్వహించిన సమావేశానికి వెళ్లారని ఎంపీ ఎర్కొన్నారు. తమిళనాడు రాష్ట్రంలో స్టాలిన్ ఆయన కొడుకు ఉదయనిధి మాత్రమే అధికారంలో ఉండాలని అనుకుంటున్నారు అని అన్నారు.

### హైడ్రోజన్ బాంబు కాదు..

## ఉల్లిగడ్డ బాంబు కూడా పేలలేదు..

- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మాజీ మంత్రి కేటీఆర్‌పై ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా కేటీఆర్ మాట్లాడుతున్నారని.. అందులో నిజం లేదని మండిపడ్డారు. హైడ్రోజన్ బాంబు కాదు.. కనీసం ఉల్లిగడ్డ బాంబు కూడా పేలలేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం మీద కేటీఆర్ బురద చల్లుతున్నారని.. ఆయన మాట్లాడే మాటలకు అర్థం పర్థం లేదని ఫైర్ అయ్యారు. గ్రౌండ్ వర్క్ లేకుండా కేటీఆర్ మాట్లాడుతున్నారని విమర్శించారు. గాంధీ భవన్ ప్రెస్ మీట్‌లో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడారు.

"ఐసీసీఐ రుణం ఇచ్చిందని కేటీఆర్ అన్నారు. టీఎస్ఐఐసీ ఫేస్ వాల్యూ చూసి 37 మంది బాండ్లు కొన్నారు. కొనుకున్న బాండ్ల పైసలు అన్ని ఐసీసీఐలో పడతాయి. ఆ విధంగానే డబ్బులు పడ్డాయి. కేటీఆర్ భూమి విలువ రూ.5,200 కోట్లు అంటారు.. కేటీఆర్ శిష్యుడు రూ.20 వేల కోట్లు అంటారు. ఎవరి మాట నమ్మాలి. కేటీఆర్ బేస్ లెస్ ప్రెస్ మీట్ పెట్టారు. లిటికేషన్ బ్యాంక్‌కు ఐసీఐసీఐ బ్యాంక్ లోన్ ఎలా ఇచ్చిందని అడిగారు. బ్యాంక్ లోన్ ఇవ్వలేదు. బాండ్ల ద్వారా వచ్చిన డబ్బులు మాత్రమే మాకు ఇచ్చింది. అవి హెచ్‌సీయూ భూములు కావు.. అటవీ భూములు కావని ఈ విషయం ద్వారా తేటతెల్లం అయ్యింది. సామాన్య ప్రజలను తప్పుతోవ పట్టించాలని చెప్పిన మాటలే తప్ప అందులో ఏ మాత్రం నిజం లేదు. హైదరాబాద్‌లో జూ ఉంది అంటే నమ్ముతారు.. కానీ అడవి ఉంది అంటే ఎవరు నమ్ముతారు చెప్పండి.. పేద ప్రజలు సన్నబియ్యం తింటే బీఆర్ఎస& వాళ్లు ఓర్చుకోవడం లేదు. బీఆర్ఎస్ నాయకులు తెలంగాణను కుక్కలు చింపిన విస్తారాకు చేశారు. ఆ విస్తరాకును కుట్టి అందులో సన్న బియ్యం అన్నం పెడుతుంటే వాళ్లు ఓర్చుకోలేక పోతున్నారు. బీఆర్ఎస్ నాయకులు పెట్టే ప్రెస్ మీట్‌లను జనాలు నమ్మకండి. వాళ్లు అబద్ధాలు చెపుతున్నారు. ప్రభుత్వం ప్రారంభిస్తున్న పథకాల్లో పాల్గొనండి. అక్కడ ఏమైనా తప్పులు జరిగితే మా దృష్టికి తీసుకురండి సమస్య పరిష్కారం చేస్తాం. వచ్చే ఎపిసోడ్‌లో అయిన బీజేపీ ఎంపీ ఎవరో చెప్పాలి" అని అన్నారు.

## వైభవంగా హనుమాన్ శోభాయాత్రలు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

హనుమాన్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో వాడవాడలా శోభాయాత్రలు నిర్వహిం చారు. గౌలిగూడ నుంచి సికింద్రాబాద్ తాడ్బండ్ హనుమాన్ ఆలయం వరకు నిర్వహించిన విజయో త్సవ ర్యాలీ ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా బజరంగ్ దళ్, విశ్వహిం దూ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు అంతకు వబందు గౌలిగూడలోని చారిత్రక రామమందిరంలో హనుమంతునికి మహా యజ్ఞం నిర్వహించారు. ఈ కా ర్యక్రమానికి అయోధ్య రామ మందిర ట్రస్టు సభ్యుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు శ్రీ రామ్ విలాస్ వేదాంతి బీజేపీ ఎమ్మె ల్యే మల్కా కొమురయ్య పజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరామ తదితరులు పాల్గొన్నారు. అనంతరం హనుమాన్ తో ఛాయాత్ర కోసం ప్రత్యేకంగా అలంకరిం కంపై వీర హనుమాన్ విగ్రహాన్ని అందంగా అలంకరించారు. శ్రీరామ్ విలాస్ దాస్ వేదాంత్ శోభాయాత్రను జెండా ఊపి ప్రారంభించారు.

గౌలిగూడ నుంచి కోఠి, నారాయణగూడు. బైపాస్ మీదుగా తాడ్ బంద్ హనుమాన్ ఆలయం వరకు 12 కిలోమీటర్ల మేర వేల మంది భక్తుల కోలాహలం నడుమ శోచాయాత్ర సాగింది. ఎండను సైతం లెక్క చేయకుండా భక్తులు కాషాయు బెండాలతో శోభాయాత్రలో పాల్గొన్నా రు ఇళ్ల దగ్గర ఉన్నభక్తులు ఘనంగా స్వాగతంపలికారు. ఈ శోభాయాత్ర అంతా జై శ్రీరామ్

మిగితా 2వ పేజీలో

## సోనియా, రాహుల్‌కు ఈడీ నోటీసులు..

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా జప్తు చేసిన రూ.661 కోట్ల విలువైన స్థిరాస్తులను స్వాధీనం చేసుకునేందుకు తాజాగా ఈడీ నోటీసులు జారీ చేసింది. ఈ విషయాన్ని ఈడీనే ప్రకటించింది. ఈ మేరకు ఢిల్లీ, ముంబై, లక్నోల్లోని ఆస్తులపై నోటీసులు అతికించినట్లు ఈడీ తన ప్రకటనలో పేర్కొంది. సంబంధిత ఆస్తులను ఖాళీ చేయాలని, లేదా వాటికి

మిగితా 2వ పేజీలో

# కంచ గచ్చిబౌలి భూముల ఆక్రమణ నిజమే

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**బలగం టీవి, హైదరాబాద్**

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కంచ గచ్చిబౌలి భూమిని అమ్మి రూ.10 వేల కోట్ల అవినీతికి పాల్పడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పునరుద్ఘాటించారు. శనివారం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల అక్రమా లు ముమ్మాటికీ నిజమేనని అన్నారు. ఇప్పటికే తాను చేసిన ఆరోపణలకు ఎలాంటి సమాధానం ఇవ్వ కుడా ప్రభుత్వం, పార్టీ ఒక్కొక్క మారి మాట్లాడుతోందని దుయ్యబట్టారు. తాము చెప్పిన తీరుగానే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను తాకట్టు పెట్టి డబ్బులు తీసుకొచ్చినట్లు పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారని, మరోవైపు ప్రభుత్వం ఇంకొక మాట మాట్లాతుతోందని కేటీఆర్ విమర్శించారు. అసలు ప్రభుత్వం హైదరాబాద్ సెంట్రల్ యూ నివర్సిటీకి చెందిన 400 ఎకరాల అడవి భూములను ఏం చేసిందో చెప్పాలని, వేలం వేసిందా? తాకట్టు పెట్టిందా? అమ్మిందా? లేదా ఇప్పటికే ప్లాట్లుగా మార్చి దొడ్డిదారిన ఎవరికైనా కేటా యించిందా? అనే విషయారీ న్ని స్పష్టం చేయాలన్నారు.

ఈ ప్రభుత్వానికి ఆ భూములపై అధికారం లేదని, దానిని ఆక్రమించడానికి ప్రయ త్నిస్తే చీఫ్ సెక్రటరీని జైలులో పెడతామని సుప్రీం కోర్టు హెచ్చరించింది నిజం కాదా? బీకాన్ అనే సంస్థకు భూములు కుదువపె ట్టింది. దానికి సంబంధించిన పత్రాలను బయటపెట్టాను. ఇది అవాస్తవమా కాదా? ప్రభుత్వం బయట పెట్టాలి. పదివేల కోట్ల రుణానికి 170 కోట్ల రూపాయలకమిషన్ ఎందుకిచ్చారు. ప్రభుత్వం ఇంత భారీగా కమిషన్ అవ్వడం ఎక్కడా చూడలేదన్నారు. భూమి ప్రభుత్వంతో అయితే దొంగ అని జేసీబీలు పెట్టాల్సిన అవసరం ఏముంది? ఆ భూమి అటవీ భూమి అని గుర్తించబడతద.. నితెలుసు కాబట్టి అటవీ భూమిపై డబ్బులు తీసుకొచ్చారు.



బీజేపీ ఎంపీ ముంబాయి బ్రోకర్ సంస్థను తీసుకొని వస్తే డబ్బులు తెచ్చుకున్నారు. 'బీజేపీ ఎంపీకి సహాయం చేస్తా అని చెప్పారు. ఆ సహాయం జరగ గానే వెంటనే ఆ పేరుతో పాటు ఆయనకు జరిగిన లాభాన్ని బయటపెడతాను. ఈ బీజేపీ ఎంపీతో ముఖ్యమంత్రికి ఉన్న పాత చందాలు అన్నింటినీ కూడా బయ ఆపెడతా బీజేపీ ఎంపీతో ముఖ్యమంత్రి చేయబోయే లాలూచీ అయ్యేంతవరకు అగి బయట పెడతాను. మేము గతంలో భూములు అమ్మినప్పుడు అధికారికంగా దొంగచాటుగా అమ్మలేదు." అని కేటీఆర్ అన్నారు. గతంలో ప్రభుత్వ సంస్థలే భూములను అమ్మాయి కానీ... రేవంత్ రెడ్డి వచ్చిన తర్వాత ఒక బ్రోకర్ సంస్థను తీసు కొచ్చి దానికి భూములు తాకట్టు పెట్టారు. ఎలాంటి అవినీతి ఆలోచనలు లేకుండానే ఆయా సంస్థలే నేరుగా భూములను అమ్ము. కోవచ్చు, కానీ మధ్యలో బ్రోకర్ సంస్థలు తీసుకొచ్చివేలకోట్ల రూపాయల అవినీతికి పాల్పడుతున్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములు ప్రభుత్వానివైతే, ప్రభుత్వం తాకట్టు పెట్టడం ఎందుకు ?1.5 నెలలుగా బిజెపి రేవంత్ రెడ్డిని అన్ని రకాలుగా కాపాడుతున్నది. బండి సంజయ్ రేవంత్ రెడ్డికి అడ్డుగా నిలబడి అరుకుంటు. న్నాడు అని కేటీఆర్ అన్నారు.

# 400 ఎకరాల భూమిని కాపాడాం

(మొదటి పేజీ తరువాయి)

నిధులను సేకరించిందని గుర్తు చేశారు. ఎస్ఈబీఐలో రిజిస్టర్ అయిన మర్చంట్ బ్యాంకర్‌ను టీజీఐఐసీ నియమించుకుందని చెప్పారు. ట్రస్ట్ ఇన్వెస్ట్ ఇండస్ట్రీ సంస్థ ఇతర రాష్ట్రాలకు నిధులు సమకూర్చిందని తెలిపారు. రైతుల సంక్షేమం, రైతు భరోసా, రైతు రుణమాఫీకి ఆ నిధులను ఉప యోగించామని వివరించారు. సన్నబియ్యం కోసం రూ.947 కోట్లు ప్రభుత్వం ఉప యోగించిందని తెలిపారు. అయినా రాష్ట్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ విషం కక్కుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ తరహాలోనే మూసీ ప్రక్షాళన చేస్తామంటే, బీజేపీ వద్దంటోందని విమర్శించారు. సబర్మతికి ఓ న్యాయం...మూసీకి మరో న్యాయమా? అని ప్రశ్నించారు. మీడియా ప్రతినిధులను సబర్మతికి తీసుకెళ్లాలంటూ మీడియా అకాడమీ చైర్మెన్‌కు సూచించారు. ఆ తర్వాత వారి నుంచి సూచనలు, సలహాలు స్వీకరిస్తామన్నారు.

సీఎం పదవిపై మంత్రి శ్రీధర్‌బాబు కీలక వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డే సీఎంగా ఉంటారని, ఆయనే ఉండి తీరుతారని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం చేస్తూ రేవంత్ అవినీతిరహిత పాలన చేస్తున్నారని కితాబిచ్చారు. కాంగ్రెస్ పార్టీలో అందరూ సమర్థులేనని అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ సచివాలయంలో సమీక్ష నిర్వహించారంటూ వచ్చిన వార్తలను తోసిపుచ్చారు. ఆమె ఎలాంటి సమీక్ష నిర్వహించలేదన్నారు. " మమ్మల్ని కలవడానికే మీనాక్షి నటరాజన్ సచివాలయానికి వచ్చారు. అక్కడికి ఎవరైనా రావొవచ్చు. బీజేపీ ,బీఆర్ఎస్ నాయకులు కూడా సచివాలయానికి వస్తారు" అని శ్రీధర్‌బాబు అన్నారు.

## దేశవ్యాప్తంగా అలర్ట్

(మొదటి పేజీ తరువాయి)

చేరుకునే వీలుంది. దీనితో రేవు పట్టణాలలో హెచ్చరికలు వెలువడ్డాయి. మరో వైపు జన ప్రయాణ రవాణా సంబంధిత రైల్వే విభాగాన్ని టార్గెట్ చేసుకునేందుకు, దాడులకు దిగేందుకు కూడా వీలుంది. ఎక్కువగా జనసమ్మర్థం గల ప్రాంతాలు, సినిమా హాళ్లు, జాతరలు, సినిమా హాల్స్ కూడా ఉగ్రవాద దాడులకు లక్షాలుగా నిలుస్తాయి. సంబంధిత ఉదాహరణలు ఉన్నాయి. 2008 ముంబై దాడుల దశలో ఉగ్రవాదులు ఎక్కువగా సముద్ర మార్గాన్ని ఎంచుకునే భారతీయ భూభాగంలోకి వచ్చి, నెలల తరబడి తిష్టవేసుకుని తరువాత దాడులకు దిగారు. దీనితో ఆయా సముద్ర మార్గాలపై నిశిత నిరంతర నిఘా పెట్టారు. ఏ విధంగా కూడా టెర్రరిస్టు విషపు పురుగులు అక్రమ ప్రవేశంజరగకుండా చర్యలు తీసుకుంటారు.

ముంబై దాడులలో ఐఎస్ఐ కీలక పాత్ర ఉందనేది బహిరంగ రహస్యం . తమ ఏజెంట్ వంటి రాణా ఇప్పుడు భారతీయ దర్యాప్తు సంస్థల కస్టడీలో ఉండటంతో ఆయన ఏ విధంగా నోరు విప్పినా అది పాకిస్థాన్‌కు, ప్రత్యేకించి ఐఎస్ఐ మెడకు చుట్టుకుంటుంది. దీనితో విచారణ ప్రక్రియ దశలోనే తమ సత్తా చాటుకునేలా చూసుకునేందుకు రంగం సిద్ధం అయింది. ఈ నేపథ్యంలో అంతా అప్రమత్తంగా ఉండాలి. జాతీయ ప్రయోజనాలు , ప్రత్యేకించి దేశ భద్రత సంబంధిత పరిణామాలపై అత్యంత జాగరూకతతో మాట్లాడాలి. స్పందించాల్సి ఉంది. ఈ బాధ్యత అన్ని రాజకీయ పార్టీలపైనా ఉందని ప్రభుత్వ వర్గాలు ఈ మేరకు తమ సమన్వయ చర్యలను పార్టీలు రాజకీయాలకు అతీతంగా చేపట్టాలని సూచించారు. ఈ సూచనలను అంతా బాధ్యతాయుతంగా పాటిస్తారనే నమ్మకం తమకు ఉందని కూడా ఇంటలిజెన్స్ వర్గాలు తెలిపాయి.

# వైభవంగా హనుమాన్ శోభాయాత్రలు

(మొదటి పేజీ తరువాయి)

జై హనుమాన్ నినా దాలతో హెూరెత్తించింది. నగర వ్యాప్తం గా హనుమంతుడి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలతో పాటు అన్నప్రసాదాలు వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. శోభాయాత్ర సందర్భంగా ర్యాలీ జరిగి మార్గాల్లో పోలీసులు బారీ బందోబస్తు నిర్వహించారు. సీసీ కెమెరాలు, డ్రోన్లతో అడుగడుగునా నిఘా ఏర్పాటు చేశారు. హైదరాబాద్ బోగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ గౌలిగూడలోని క్రీడాను మంది. రానికి చేరుకుని భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఇక హనుమాన్ జయంతి సందర్భంగా కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు కాలి నడకన కిలోమీటర్ల దూరం నుండి అంజన్ననను దర్శనం చేసుకోవటానికి వచ్చారు. మూడు రోజుల పాటు కొండగట్టు ఆంజనేయ స్వామి జయంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశారు.

# వనజీవి రామయ్య హఠాన్మరణం

(మొదటి పేజీ తరువాయి)

పుస్తకంలో రామయ్య జీవితం పాఠ్యాంశంగా బోధిస్తున్నది.

రామయ్యకు భార్య జానమ్మ, నలుగురు సంతానం. ఓవైపు కుటుంబ భారాన్ని మోస్తూనే.. నాలుగు దశాబ్దాలకు పైగా మొక్కలు నాటుతూ వచ్చారు. మనుమళ్లు, మనుమరాళ్లకు కూడా యాన చెట్ల పేర్లే పెట్టారు. ఒకామె పేరు చందనపుష్ప, ఇంకో మనుమరాలు హరిత లావణ్య. కుబంధపుష్ప అని ఇంకో పాపకు పెట్టాడు. మరో మనవరాలికి వనశ్రీ అని నామకరణం చేశారు. కోటికిపైగా మొక్కలను నాటి ట్రీ మ్యాన్ ఆఫ్ ఇండియాగా గుర్తింపు పొందిన రామయ్య సేవలకుగాను పలు సంస్థలు అవార్డులతో సత్కరించాయి. 2005లో సెంటర్‌ఫర్ మీడియా సర్వీసెస్ సంస్థ నుంచి మనమిత్ర అవార్డులో ఇచ్చింది. యూనివర్సల్ గ్లోబల్ పీస్ అనే అంతర్జాతీయ సంస్థ ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రధానం చేసింది. 1995లో భారత ప్రభుత్వం నుంచి వనసేవా అవార్డు లభించింది.

ఓవైపు వ్యక్తిగత జీవితాన్ని, మరోవైపు తన మొక్కల పెంపకాన్ని బ్యాలన్స్ చేసుకుంటూ జీవితాన్ని కొనసాగించారు రామయ్య. భార్య జానకమ్మ, నలుగు బిడ్డలకు ఏలోటు రాకుండా చూసుకుంటూ ప్రకృతి ప్రేమను చాటుకున్నాడు. అమొదట్లో తన ఇంటిదగ్గర సొంతస్థలంలో మొక్కల పెంపకం ప్రారంభించారు రామయ్య. ఆ తర్వాత మెల్లిగా ఖాళీ ప్రదేశాలు, ప్రభుత్వ భూములు, రోడ్లపక్కన చెట్లు పెంచేవాడు. ఎండాకాలంలో అడవుల నుండి విత్తనాలు సేకరించి వానాకాలంలో చల్లేవాడు. ఇలా అతడు తన జీవితంలో కోటికి పైగా మొక్కలు నాటాడు... అవిప్పుడు మానవాళికి ఆహ్లాదరకమైన వాతావరణాన్ని అందిస్తున్నాయి. పేరుకోసమో, డబ్బుల కోసమే కాదు కేవలం ప్రకృతిని కాపాడాలన్న ఒకే ఒక్క లక్ష్యంతో నిస్వార్థంగా మొక్కల పెంపకాన్ని సాగించారు రామయ్య. తాను పెంచడమే కాదు అందరూ మొక్కలు పెంచాలంటూ 'వృక్షో రక్షతి రక్షిత:' అనే బోర్డులు తలకు పెట్టుకుని, మెడలో వేసుకుని ప్రచారం చేసేవారు. స్కూళ్లు, కాలేజీల విద్యార్థులను ఈ మొక్కల పెంపకంపై అవగాహన కల్పించి వారినికూడా భాగస్వామ్యం చేసేవారు. ఇలా పర్యావరణాన్ని కాపాడేందుకు విశేషమైన కృషి చేశారు రామయ్య.

పద్మశ్రీ వనజీవి రామయ్య మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం ప్రకటించారు . ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రకృతి పర్యావరణం లేనిదే మానవ మనుగడ లేదనే సిద్ధాంతాన్ని బలంగా నమ్మిన వ్యక్తి వనజీవిగా పేరుగాంచిన దరిపల్లి రామయ్య గారు. ఒక వ్యక్తిగా మొక్కలు నాటడం ప్రారంభించి మొత్తం సమాజాన్ని ప్రభావితం చేసిన వ్యక్తి పద్మశ్రీ రామయ్య .. పర్యావరణ రక్షణకు పాటుపడుతూ తన జీవితాన్ని అంకితం చేసిన రామయ్య గారి ఆత్మకు నివాళి. వారు సూచించిన మార్గం నేటి యువతకు ఆదర్శం. వారి మరణం సమాజానికి తీరని లోటు అంటూ వనజీవీ కుటుంబ సభ్యులకు రేవంత్ తన తీవ్ర సంతాపం తెలియజేసారు.

ర్యావరణ పరిరక్షణే ప్రాణంగా బతికిన పద్మశ్రీ వనజీవి రామయ్య మృతిపట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విచారం వ్యక్తం చేస్తూ, సంతాపం ప్రకటించారు. వృక్షో రక్షతి రక్షితః అనే నినాదాన్ని తన శరీరంలో భాగం చేసుకుని, కోటికి పైగా మొక్కలను నాటి, ప్రపంచానికి పచ్చదనం ప్రాముఖ్యతను ప్రచారం చేసిన వనజీవి రామయ్య లక్ష్యం మహెూన్నతమైనదని అన్నారు. మొక్కల పెంపకం కోసం వనజీవిగా మారిన దర్పల్లి రామయ్య జీవితం రేపటి తరాలకు ఆదర్శనీయమని కొనియాడారు. ప్రపంచ పర్యావరణం కోసం సాగిన మానవ కృషిలో వనజీవిగా ఆయన చేసిన త్యాగం అసమాన్యమైనదని కేసీఆర్ అన్నారు.అడవులు, పచ్చదనం అభివృద్ధి దిశగా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన.. తెలంగాణకు హరితహారం ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు దర్పల్లి రామయ్య అందించిన సహకారం గొప్పదని గుర్తు చేసుకున్నారు. భవిష్యత్తు తరాలకు మనం అందించే సంపద హరిత సంపదే కావాలని, భౌతిక ఆస్తులు కావని పునరుద్ఘాటించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## భూభారతి పోర్టల్‌పై ఉన్నత స్థాయి సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

సాంకేతికంగా బలమైన వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లతో భూ భారతి పోర్టల్‌ను నిర్వహించాలి. భూ భారతి పోర్టల్ ప్రజలకు సేవలను సులభతరం చేయడంతో పాటు, వారి భూ సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించే లక్ష్యంతో రూపొందింది కాబట్టి ప్రజల అవసరాలకు అనుగుణంగా నిరంతరం మెరుగుపరచాలి" అని ముఖ్యమంత్రి గారు నిర్దేశించారు.

## సోనియా, రాహుల్‌కు ఈడీ నోటీసులు..

(మొదటి పేజీ తరువాయి)

వచ్చే అద్దెలను బదిలీ చేయాలని ఆ ప్రకటనలో ఆదేశించింది. పీఎంఎల్‌ఏ చట్టం కింద ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. నేషనల్ హెరాల్డ్ పత్రికకు అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ ప్రచురణకర్తగా ఉంది. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్ సహా కొందరు పార్టీ నేతలు ప్రమోటర్లుగా ఉన్న 'యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్' AJL కు యాజమాన్య సంస్థ.

కాంగ్రెస్‌కు ఏజేఎల్ బకాయిపడ్డ రూ.90 కోట్లను వసూలు చేసుకునే విషయంలో 'యంగ్ ఇండియన్'లో ఆర్థిక అవకతవకలు జరిగాయని ఆరోపణలున్నాయి. ఈ ఆరోపణలపై ఈడీ దర్యాప్తు జరుపుతోంది. దర్యాప్తులో భాగంగానే 2023 నవంబర్‌లో సంబంధిత స్థిరాస్తులతోపాటు ఏజేఎల్‌లో ఈక్విటీ షేర్ల రూపంలో ఉన్న 'యంగ్ ఇండియన్' కు చెందిన రూ.90.21 కోట్లను జప్తు చేసింది. ఈ కేసుకు సంబంధించి సోనియాగాంధీ, రాహుల్ గాంధీలతోపాటు ప్రస్తుత కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, సీనియర్ నేత పవన్ కుమార్ బన్సల్‌లను ఈడీ ఇప్పటికే విచారించింది. వారి స్టేట్‌మెంట్లనూ రికార్డు చేసింది. తాజాగా సంబంధిత స్థిరాస్తుల స్వాధీనానికి నోటీసులు ఇచ్చింది.

## రాకేష్ రెడ్డికి టీజీపీఎస్సీ పరువునష్టం దావా నోటీస్

**బలగం టీవి, హైదరాబాద్**

బీఆర్ఎస్ నేత రాకేశ్ రెడ్డికి టీజీపీఎస్సీ షాక్ ఇచ్చింది. గ్రూప్-1 ఫలితాల విషయంలో తమపై తప్పుడు ఆరోపణలు చేశారంటూ పరువు నష్టం దావా నోటీసులు జారీ చేసింది. వారం రోజుల్లో ఈ నోటీసులకు సమాధానం ఇచ్చి, క్షమాపణలు చెప్పాలని, లేదంటే పరువు నష్టం కేసులు, ఇతర క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించింది. ఇకపై టీజీపీఎస్సీపై రాకేశ్ రెడ్డి ఎలాంటి ఆరోపణలు చేయవద్దని ఆ నోటీసుల్లో పేర్కొంది. సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు పెట్టవద్దని కూడా తెలిపింది. టీజీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్‌లోని అన్ని పేపర్లను రీవ్యాల్యుయేషన్ చేయాలని ఏప్రిల్ 1వ తేదీన రాకేశ్ రెడ్డి డిమాండ్ చేశారు. పరీక్ష నిర్వహణ, వాల్యుయేషన్‌లో తప్పిదాలు జరిగాయని, వాటిని సరిదిద్దుకోవాలని సూచించారు. గ్రూప్-1లో తెలుగు మీడియం విద్యార్థులకు అన్యాయం జరిగిందని, 40 శాతం మంది విద్యార్థుల్లో టాప్ 500లో ఒక్కరు కూడా లేరని ఆయన అన్నారు.

# డాక్టర్ కావాలని కోరిక ఉండేది

- నా చిన్నతనంలో మా అమ్మ కూడా నేను డాక్టర్ కావాలని కోరుకుంది..
- దేశంలో ప్రతి జిల్లాలో గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఎంబీబీఎస్ విద్యార్థుల స్నాతకోత్సవంలో పాల్గొన్న కేటీఆర్..



**బలగం టీవీ, కరీంనగర్**

తనకు డాక్టర్ కావాలని కోరిక ఉండేదని, పొలిటికల్ లీడర్ ను అయి ప్రజాసేవకు అంకితమయ్యానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్ లో చల్మెడ ఆనందరావు మెడికల్ కళాశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. గ్రాడ్యుయేషన్ డే కు కేటీఆర్ తోపాటు ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, డాక్టర్ సంజయ్, చైల్మెడ ఆనందరావు మెడికల్ కళాశాల చైర్మన్ డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి, వ్యవస్థాపకులు చెల్మెడ లక్ష్మీనరసింహారావు పాల్గొని ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్న వైద్య



విద్యార్థులకు పట్టాలు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ తనకు డాక్టర్ కావాలని కోరిక ఉండేదని, కానీ ఇక్కడ బీఫార్మసీలో సీటు వచ్చిందన్నారు. కర్నాటకలో కే సెట్ రాస్తే అక్కడ డాక్టర్ సీటు వచ్చిందని, డాక్టర్ సీటు రావడంతో తనతో పాటు మా అమ్మ సంతోషపడిందని తెలిపారు. డాక్టర్ కావాలనే కోరికతో బిజీగా ఉండే నాన్న కేసీఆర్ వద్దకు వెళ్లి చెప్పగా ఐదేళ్లు ఎంబీబీఎస్ చదవాలి... రెండేళ్లు పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయాలి... ఆ తర్వాత స్పెషలైజేషన్ ఉంటుందని కౌన్సిలింగ్ ఇచ్చారని తెలిపారు. వ్యక్తిగత జీవితం, ప్రాధాన్యతలను కూడా పక్కన పెట్టి ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా డాక్టర్లు పనిచేయాల్సి ఉంటుందని కేసీఆర్ చెప్పారన్నారు. అయితే డాక్టర్ కావాలనే ఆలోచన విరమించుకొని డిగ్రీలో జాయిన్ అయ్యానని చెప్పారు. డాక్టర్ కావాల్సిన తాను డిగ్రీలో జాయిన్ అయి పొలిటికల్ లీడర్ ను అయ్యానని స్పష్టం చేశారు.

ప్రతి జిల్లాలో గవర్నమెంట్ మెడికల్ కాలేజ్, గవర్నమెంట్ నర్సింగ్ కాలేజ్ ఉన్న ఏకైక రాష్ట్రం దేశంలో తెలంగాణ ఒక్కటే అన్నారు. బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలన కాలంలో తెలంగాణలో మెడికల్ విద్య, ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. పేషంట్లతో డాక్టర్లు సరిగా మాట్లాడితే సగం జబ్బు నయమవుతుందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ రూపంలో డాక్టర్లకు రాబోయే రోజుల్లో పెద్ద చాలెంజ్ ఎదురు కాబోతుందని, చాట్ జిపిటి, గ్రోక్ లు ప్రిస్కిప్షన్ లు కూడా రాస్తున్నాయని ఏఐ ఇచ్చే సమాచారం ఆధారంతో చాలా మంది పేషెంట్లు డాక్టర్ల దగ్గరకు వస్తున్నారని, రాబోయే రోజుల్లో ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని ఇలాంటి పేషెంట్లను చాలా జాగ్రత్తగా హ్యాండిల్ చేయాల్సి ఉంటుందని అన్నారు.కరుణ, సానుభూతి తో రోగులకు డాక్టర్లు సేవ చేయాలని, బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలన కాలంలో తెలంగాణలో మెడికల్ విద్య, ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చామని, ప్రతి జిల్లాలో గవర్నమెంట్ మెడికల్ కాలేజ్, గవర్నమెంట్ నర్సింగ్ కాలేజ్ ఉన్న ఏకైక రాష్ట్రం దేశంలో తెలంగాణ ఒక్కటే అని, హెల్త్ కేర్ రంగంలో తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్ గా మార్చామని అన్నారు. వైద్యరంగంలో తెలంగాణ సాధించబోయే ప్రగతిలో మీరందరూ భాగస్వాములు కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నారు.

## సంస్కృతం ద్వితీయ భాషగా పెట్టే ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి..



**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ విద్యలో సంస్కృతం ద్వితీయ బోధన భాషగా పెట్టాలని రీజనల్ జాయింట్ డైరెక్టర్ జారీచేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని, ఇది మాతృ భాష తెలుగుకు గొడ్డలిపెట్టులాంటిదనీ, పి.జి స్థాయి వరకు తెలుగును తప్పనిసరిగా అమలుచేయాలని తెలంగాణ వివేక రచయితల సంఘం అధ్యక్షుడు డా.వాసరవేణి పరశురాం శనివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డా.వాసరవేణి పరశురాం మాట్లాడుతూ మాతృ భాష తెలుగును రక్షించే బాధ్యత రెండు తెలుగు రాష్ట్రాల్లో పుట్టిన ప్రతి ఒక్కరిదనీ ,2020 జాతీయ విద్యావిధానంలో మాతృభాషకు అత్యంత ప్రాధాన్యతనిచ్చిందనీ అన్నారు. ఇటువంటి తరుణంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ విద్యలో సంస్కృతం ద్వితీయ భాషగా ప్రవేశపెట్టాలని ఉత్తర్వులు జారీ చేయడం తెలుగు భాషా సంస్కృతులను కనుమరుగుచేయడమేనన్నారు. సంస్కృతం సబ్జెక్టు తీసుకున్న వారు హిందీ, ఇంగ్లీష్, తెలుగులో జవాబులు రాయవచ్చుననే సౌకర్యంతో తెలుగును పక్కనపెడుతారనీ తెలుగు ఉనికికే ప్రమాదం అన్నారు. ఇప్పటికే ప్రైవేటు కళాశాలల్లో 99శాతం తెలుగు భాషా బోధన జరుగటంలేదనీ, ఈ ఉత్తర్వులతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో తెలుగు పూర్తిగా కనుమరుగై పోతుందన్నారు. అసలు మాతృభాషలోనే మానసిక వికాసం ఎక్కువగా జరుగుతుందనీ, ఒత్తిడి ఉండదన్నారు.జపాన్,సింగాపూర్, మొదలగు దేశాల్లో వారి మాతృభాషలోనే విద్యాబోధన చేస్తూ పరిశోధనలో, వృద్ధిలో ముందు ఉన్నారన్నారు. తెలంగాణలో ప్రభుత్వం పి.జి వరకు తెలుగును నిర్భంధంగా అమలుచేయాలని పరశురాం డిమాండ్ చేశారు.

## హత్యకు పాల్పడ్డ వ్యక్తి అరెస్టు

**రిమాండ్‌కు తరలింపు**

**వివరాలు వెల్లడించిన సీఐ శ్రీనివాస్ గౌడ్**

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శుక్రవారం ఓ వ్యక్తి హత్య చేసిన సంఘటనలో నిందితున్ని శనివారం రోజు అరెస్ట్ చేసి జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించడం జరిగిందని సిఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని కుంచం పరశురాములు అనే వ్యక్తి శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో తండ్రి కనకయ్యను కర్రతో మెడపై కొట్టి హతమార్చి ఫరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు టెక్నికల్ సహాయంతో నిందితుని శనివారం ఉదయం అరెస్ట్ చేసి జ్యూడిషియల్ కస్టడీకి తరలించడం జరిగిందని సీఐ తెలిపారు.

## హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్సీ కవిత ప్రత్యేక పూజలు

**బలగం టీవీ, హైదరాబాద్**





హనుమాన్ జయంతి సందర్భంగా కర్మన్ ఘాట్ హనుమాన్ ఆలయంలోఎమ్మెల్సీ కవిత , ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. పూజ అనంతరం ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సంధ్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజలందరికీ హనుమంతుడి అనుగ్రహం లభించాలని, హనుమంతుని దయతో ప్రతి ఒక్కరి జీవితాలు విజ్ఞానంతో నిండిపోవాలని ప్రతి ఒక్కరిలో భక్తి భావం ఉండాలని, హనుమంతుడి కృప ఎల్లప్పుడూ తెలంగాణ ప్రజలపై ఉండాలని ఆకాంక్షిస్తున్నాను అని అన్నారు.

## బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**



వేములవాడ రూరల్ మండలం ఎదురుగట్ల గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రభుత్వ విప్ కు ఆలయ కమిటి సభ్యులు, అర్చకులు పూర్ణకుంభతో స్వాగతం పలికారు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మన ప్రాంతంలో ఎంతో పురాతన ఆలయం ఉండటం మన ప్రాంత ప్రజల అదృష్టం అన్నారు. ఆ స్వామి వారి దివ్య ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు.

## గుండెపోటుతో విశ్రాంతి ఎంఈఓ మృతి

- బొప్పాపూర్ లో విషాదం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామానికి చెందిన విశ్రాంతి ఎంఈఓ గుండెపోటుతో మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం మార్పు నారాయణరెడ్డి(76) అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎల్లారెడ్డి పేట ఉన్నత పాఠశాలలో గణితం బోధించారు. విధి నిర్వహణలోని ఎం ఈ ఓ గా పదోన్నతి పొంది మంథని నియోజక వర్గంలోని ఓ మండల విద్యాధికారిగా పనిచేశారు.రిటైర్డ్ అయిన అనంతరం గ్రామంలో వ్యవసాయ పనులు చూసుకునే వారు. కొద్దిరోజుల క్రితం అనారోగ్యానికి గురై హైదరాబాదులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్యం పొందుతున్న క్రమంలో శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని శనివారం స్వగృహం రాచర్ల బొప్పాపూర్ కు తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్య ఒక కుమారుడు ఉన్నారు. కూతురు శిరీష నాలుగు సంవత్సరాల క్రితం క్యాన్సర్ వ్యాధితో చనిపోయింది. నారాయణ రెడ్డి ఆకస్మిక మృతి బంధువులు, గ్రామస్తులు, తోటి ఉపాధ్యాయులు, పలువురు ప్రజాప్రతినిధులు, విద్యార్థులు మృతదేహానికి నివాళులర్పించారు.



## గ్రామంలో పర్యటించిన కేంద్ర బృందం

**బలగం టీవీ, బోయినిపల్లి**

జల్ జీవన్ మిషన్ లో భాగంగా సర్వే ఆఫ్ ఇండియా చెందిన కేంద్ర బృందం రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొత్తపేట గ్రామంలో పర్యటించింది. గ్రామంలోని మంచినీటి సరఫరా స్థితిగతులు వివిధ కులాల జీవన ప్రమాణాల వివరాలు సేకరించినట్టు కార్యదర్శి మల్లేష్ తెలిపారు.

## హన్మాజీపేట నక్క వాగు బ్రిడ్జిపై రాకపోకలు షురూ..

**మాజీ ఎమ్మెల్యే రమేష్ బాబు పట్టుదల..**

**ప్రస్తుత ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కృషితో బ్రిడ్జి నిర్మాణం పూర్తి..**

**హర్షం వ్యక్తం చేస్తున్న స్థానిక ప్రజలు**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట గ్రామంలో నక్క వాగుపై నూతనంగా నిర్మించిన బ్రిడ్జిపై శనివారం వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే రమేష్ బాబు పట్టుదలతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి ప్రొసిడింగ్ మంజూరు చేయించగా, గత సంవత్సరం బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆ తర్వాత ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశాలతో కాంట్రాక్టర్ బ్రిడ్జి నిర్మాణ పనులను శరవేగంగా పూర్తి చేసి నేడు ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రస్తుతం బ్రిడ్జి ఇరువైపులా మట్టి రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతూన్నాయి. దీంతో వాహనాల రాకపోకలను బ్రిడ్జిపై నుంచి వెళ్లేందుకు అనుమతించడంతో స్థానిక ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరికొద్ది రోజుల్లోనే బ్రిడ్జి నిర్మాణానికి రంగులు అద్ది ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించనున్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే రమేష్ బాబు, ప్రస్తుత ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లకు ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

# ఉప్పల్‌లో షేకాడించిన అభిషేక్ ..!

- శతక్కొట్టి మ్యాచ్‌ను గెలిపించిన శర్మ
- 246 పరుగులను చేధించిన సన్ రైజర్స్ హైదరాబాద్

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపీఎల్ 2025లో వరుసగా నాలుగు మ్యాచుల్లో ఓడి.. డీలా పడ్డ సన్ రైజర్స్ హైదరాబాద్‌కు గెలుపు దక్కింది. ఉప్పల్ వేదికగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అభిషేక్ శర్మ(55 బంతుల్లో 14 ఫోర్లు, 10 సిక్స్‌లతో 141) పెను విధ్వంసం సృష్టించడంతో 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. పంజాబ్ కింగ్స్ నిర్దేశించిన 246 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించింది.


ముందుగా బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 245 పరుగుల భారీ స్కోర్ చేసింది. ప్రభ్‌సిమ్రాన్ సింగ్(23 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 42), ప్రియాన్ష్ ఆర్య(13 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లతో 36) రాణించారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లలో హర్షల్ పటేల్(4/42) నాలుగు వికెట్లు తీయగా.. ఇషాన్ మలింగా(2/45) రెండు వికెట్లు పడగొట్టాడు.

అనంతరం సన్‌రైజర్స్ హైదరాబాద్ 18.3 ఓవర్లలో 2 వికెట్లకు 247 పరుగులు చేసి గెలుపొందింది. అభిషేక్ శర్మతో పాటు ట్రావిస్ హెడ్(37 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లతో 66) హాఫ్ సెంచరీతో రాణించాడు. హెన్రిచ్ క్లాసెన్(14 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 21 నాటౌట్) మెరుపులు మెరిపించాడు. పంజాబ్ కింగ్స్ బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, యుజ్వేంద్ర చాహల్ చెరో వికెట్ తీసారు.



## రాసి పెట్టి మరి కొట్టాడు

అభిషేక్ శర్మ కేవలం 40 బంతుల్లో సెంచరీ సాధించాడు. ఈ సెంచరీని అభిషేక్ శర్మ తనదైన శైలిలో సెలెబ్రేట్ చేసుకున్నాడు. హెల్మెట్‌లో నుంచి ఓ పేపర్ తీసి.. అందరికి చూపిస్తూ సంతోషం వ్యక్తం చేశాడు.ఆ పేపర్‌పై This one is for Orange army(ఈ సెంచరీ ఆరెంజ్ ఆర్మీ కోసం)'అని రాసి ఉంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. 'రాసి పెట్టి మరి కొట్టాడు'అని ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు.






## గుజరాత్‌పై లక్నో గెలుపు

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపీఎల్ 2025లో భాగంగా గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచులో లక్నో సూపర్‌జెయింట్స్ విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. ఓపెనర్లు శుభ్‌మన్ గిల్ (60బీ 38 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్), సాయి సుదర్శన్ (55బీ 35 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకాలు బాదారు. లక్ష్య చేధనలో లక్నో జట్టు 19.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి టార్గెట్‌ను సునాయాసంగా చేధించింది. నికోలస్ పూరన్(61), ఓపెనర్ ఎడెన్ మర్క్రమ్(58) హాఫ్ సెంచరీలతో చెలరేగారు.

మొదట బరిలోకి దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి180 పరుగులు చేసింది. ఓపెనర్లు శుభ్‌మన్ గిల్ (60), సాయి సుదర్శన్ (55) అర్ధ సెంచరీతో అదరగొట్టారు. మిగతా వాళ్లెవరూ అంతగా రాణించలేకపోయారు. రూథర్‌ఫోర్డ్ (22) , జోస్ బట్లర్ (16), వాషింగ్టన్ సుందర్ (2) పరుగులు మాత్రమే చేశారు. చివరికి షారుక్ ఖాన్ (11), రషీద్ ఖాన్ (4) నాటౌట్‌గా నిలిచారు. లక్నో బౌలర్లలో రవి బిష్ణోయ్ 2, శార్దూల్ ఠాకూర్ 2, దిగ్వేశ్ రాఠీ, అవేశ్ ఖాన్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

ఈ లక్ష్యాన్ని లక్నో 4 వికెట్లు కోల్పోయి మూడు బంతులు మిగిలుండగా ఛేదించింది. మార్క్రమ్ (58), నికోలస్ పూరన్ (61) హాఫ్ సెంచరీలతో అదరగొట్టారు. మిచెల్ మార్ష్ స్థానంలో ఓపెనర్‌గా వచ్చిన రిషభ్ పంత్ (21) ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. ఆయుష్ బదోని 28 పరుగులు సాధించాడు. గుజరాత్ బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ, రషీద్ ఖాన్, వాషింగ్టన్ సుందర్ చెరో వికెట్ పడగొట్టారు.




## 'విశ్వంభర' నుంచి రామరామ సాంగ్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'విశ్వంభర'. ఈ చిత్రాన్ని 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా ఈ సినిమా షఉటింగ్ జరుగుతోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన తొలి పాటను విడుదల చేసింది చిత్ర బృందం. హనుమన్ జయంతి సందర్భంగా 'రామ.. రామ..' అనే పాటను విడుదల చేసి మోగా అభిమానులకు ట్రీట్ ఇచ్చింది.

ఈ రోజు హనుమాన్ జయంతి సందర్భంగా 'విశ్వంభర' నుంచి ఆ పాట విడుదలైంది. రాములోరి గొప్ప చెప్పుకుందామా 'రాములోరి గొప్ప చెప్పుకుందామా సాములోరి పక్కన ఉన్న సీతమ్మ లక్షణాలు చెప్పుకుందామా అంటూ సాగే ఈ గీతాన్ని సరస్వతి పుత్ర రామ జోగయ్య శాస్త్రి రాశారు. ఆస్కార్ పురస్కార గ్రహీత, ప్రముఖ సంగీత దర్శకులు ఎంఎం కీరవాణి బాణీలు అందించారు. శంకర్ మహదేవన్, లిప్సిక అద్భుతంగా ఆలపించారు. పాట ప్రారంభంలో 'జై శ్రీరామ్' అంటూ వచ్చే చిరంజీవి వాయిస్ ఒకటి డివోషనల్ వైబ్ తీసుకొచ్చింది అనే చెప్పాలి.

## 'మాస్ జాతర'లో 'చూపుల్తో గుచ్చి గుచ్చి' రీక్రియేట్

**బలగం టీవీ, హైదరాబాద్**

మాస్ మహరాజా రవితేజ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మాస్ జాతర'. 'మనదే ఇదంతా' ట్యాగ్‌లైన్. ఈ సినిమాకు భాను భోగవరపు దర్శకత్వం వహిస్తుండగా.. శ్రీలీల కథానాయికగా నటిస్తుంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రం మే 9న థియేటర్‌లలో సందడి చేయనుంది. తాజాగా ఈ మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ ప్రోమోను విడుదల చేశారు మేకర్స్. 'తు మేరా లవర్' అంటూ సాగే ఈ ప్రోమోలో రవితేజ నటించిన ఐకానిక్ మూవీ ఇడియట్ లోని 'చూపుల్తో గుచ్చి గుచ్చి పాటను రీక్రియేట్ చేయబోతున్నట్లు తెలుస్తుంది. కాగా దీని పూర్తి పాట ఈ నెల 14న విడుదల కానుంది. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతాన్నందిస్తున్నారు






## అతని కళ్లలో ఒక ఆకర్షణ ఉంటుంది

- షాలినీ పాండే

**బలగం టీవీ, హైదరాబాద్**

విజయ్ దేవరకొండ మూవీ 'అర్జున్ రెడ్డి' తో షాలినీ పాండే హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. తొలి చిత్రంతోనే షాలిని మంచి గుర్తింపు పొందింది. అయితే ఆ తర్వాత ఆమె చేసిన సినిమాలు పెద్దగా హిట్ కాకపోవడంతో రేస్ లో ఆమె వెనుకబడిపోయింది. ప్రస్తుతం ఆమె హిందీ, తమిళ సినిమాలు, వెబ్ సిరీస్ లలో నటిస్తోంది. తాజాగా ఆమో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ బాలీవుడ్ స్టార్ రణబీర్ కపూర్ తో కలిసి నటించాలనేది తన కోరిక అని చెప్పింది. అతని కళ్లలో ఒక ప్రత్యేకమైన ఆకర్షణ ఉంటుందని, నటనలో ఒక మాయ ఉంటుందని తెలిపింది. రణబీర్ తో కలిసి ఒక్క రోజైనా పని చేయాలనేది తన కోరిక అని చెప్పింది. ప్రతి సినిమాలో రణబీర్ నటనలో మార్పు కనిపిస్తుందని కితాబునిచ్చింది.

## ఒక్క పాటకు తమన్నా రూ. కోటి రెమ్యూనరేషన్..!

**బలగం టీవీ, హైదరాబాద్**




తమన్నా తాజాగా 'రైడ్ 2'లో ఓ స్పెషల్ సాంగ్ చేసిన సంగతి తెలిసిందే. 'నషా' అంటూ సాగే ఈ పాట సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారింది. అయితే ఈ పాటకు తమన్నా ఎంత రెమ్యూనరేషన్ తీసుకుందోనని చర్చ నడుస్తోంది. ఈ క్రమంలోనే నషా పాటలో ఆడిపాడేందుకు తమన్నా రూ.1 కోటి రెమ్యూనరేషన్ అందుకుందని బాలీవుడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తుంది. దీంతో, స్క్రీన్‌పై 5 నిమిషాలు కనిపించినందుకు తమన్నా ఇంత భారీ మొత్తం తీసుకుందా అని నెటిజన్లు మాట్లాడుకుంటున్నారు.

## 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' ట్రైలర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**




విజయశాంతి, నందమూరి కళ్యాణ్ రామ్ నటించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. ఈ సినిమాలో సయీ మంజ్రేకర్ హీరోయిన్ గా నటిస్తున్నారు. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. చిత్ర యూనిట్ శనివారం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ ట్రైలర్ విడుదల కార్యక్రమం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. యాక్షన్ ప్రధానంగా రూపొందిన ఈ చిత్రం టైటిల్‌కు తగ్గట్టుగా తల్లీకొడుకుల అనుబంధానికి ప్రాధాన్యతనిస్తూ తెరకెక్కినట్లు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. ఈ చిత్రం విడుదల కోసం ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు.